22072024-MAI-04_Layout 1 7/22/2024 1:24 AM Page 1

శర దాశరథి శత జయంతి నేడు

పీడిత ప్రజావాణి పోరు గర్జన

మహాకవి దాశరథి

తెలంగాణ ఆత్మగౌరవ కవిత్వంతో ఆధునిక తెలుగు సాహిత్యాన్ని తేజోవంతం చేసిన మహా కవి దాశరథి కృష్ణమాచార్యులు. దాశరథి హృదయం హిమఖండం. దాశరథి కవిత్వం ఒక అగ్నిగుండం. ప్రజావిముక్తి ఉద్యమంలో బద్ధలైన అగ్నిపర్వతంలా ఆయన కలమెత్తి గళమెత్తి గర్జించాడు. వైతాళిక గీతావళితో భూగోళానికి అగ్గిపెట్టి తిమిరంతో సమరం సాగించాడు. 'పీడిత ప్రజావాణికి మైక్ అమర్చి' కోటి రత్నాలవీణ శ్రుతిలో కావ్యగానం చేశాడు.

'ఏ కంటిలోనూ కన్నీటి చుక్క కనిపించని ఆదర్శ సమాజం రచయిత ధ్యేయం కావాలని' పిలుపునిచ్చిన దాశరథి ఈ సమున్నత ఆశయసాధన కోసం తన సాహిత్యాన్ని అంకితం చేశాడు. పద్యం, గేయం, వచన కవిత, అనువాదం, రుబాయీ లాంటి భిన్న ప్రక్రియల్లో దాశరథి మిన్నగా రాణించాడు. ప్రాంతదర్శి కానివాడు క్రాంతదర్శి కాలేడు అన్నట్టుగా, తన ప్రాంత నైసర్గిక, భౌగోళిక, సాంస్కృతిక వైభవ ప్రాభవాలను కవిత్వంలో దాశరథి రసరమ్యంగా రాశిపోశాడు. వాసిగాంచిన తెలంగాణ ప్రశస్తిని సగర్వంగా చాటిచెప్పాడు.

సంప్రదాయ వైష్ణవ కుటుంబంలో జన్మించిన దాశరథి, సాయుధ విప్లవ పోరాట స్ఫూర్తితో కుల మత పరిమితులను ఛేదించుకొని ప్రగతిశీల పథంలో ముందుకు సాగిపోయాడు. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ వంటి సంస్థల సాంగత్యంలో ఆనాటి నైజాం రాజ్యంలో జాగీర్దారుల, జమీందారుల దౌర్జన్యాలను, రజాకారుల రక్తదాహాన్ని ధిక్కరించి సాంస్కృతిక సమరం చేశాడు. నిజాం నియంతృత్వ ధోరణికి, దమననీతికి వ్యతిరేకంగా పన్నెండేండ్ల ప్రాయంలోనే దాశరథి పదునైన పద్యాస్త్రాలను సంధించాడు. కవి సమ్మేళనం జరుగుతున్న సభా వేదికను శత్రువులు తగలబెట్టినా లెక్కచేయకుండా ఆ నిప్పు రవ్వల నడుమ నిలబడి వీరోచితంగా కవితా పఠనం చేసిన ధీరోదాత్తుడు దాశరథి. జాతీయోద్యమం, తెలంగాణ సాయుధ పోరాటాల ఎరుకతో దేశభక్తిని, నిజాం రాష్ట్ర ప్రజల దాస్య విముక్తిని, శ్రమజీవుల త్యాగాలను దాశరథి అద్భుతంగా కవిత్వీకరించాడు. రైతు కూలీల కష్టనష్టాలను వేయి కన్నులతో పరిశీలించి వారి కన్నీటిని కలం గుండెల్లోకి వొంపుకొని కావ్యాలు రాశాడు. 'అనాథుడికి ఆగర్భ శ్రీనాథుడికి' అనాదిగా సాగుతున్న అనంత సంగ్రామాన్ని వర్ణించాడు. దేవుళ్లను దయ్యాలను వేడనని, ధనరాజుకు, రారాజుకు ఓడనని, సాహసోపేతంగా దాశరథి ప్రకటించాడు.'ధనవంతుల కనక సౌధాలకివతల వణికే నిరుపేదల అడుసు గుడిసె గోడను' అని లేమికి విధేయంగా చాటింపు వేశాడు. నిరుపేదల స్వేదంలోనే ప్రసాదం ఉన్నదని నిర్ధారించాడు. చింతల తోపులో కురిసే చినుకులకు తడిసి ముద్దయిపోతున్న బాలింత ఒడిలోని పసిబిడ్డ కోసం రుద్రవీణపై వెచ్చని అగ్ని గీతాలను ఆలపించాడు. మట్టి తట్ట నెత్తిన పెట్టుకొని మండుటెండలో ప్రయాస పడుతున్న కూలి తల్లి కోసం అరుణ తరుణాక్షరాల పద్యాలు కూర్చాడు. ఎంగిలి మెతుకులకై ముందుకుసాగే ఆకలి డొక్కలను, చింకి పాతలకై వేచియున్న దిగంబర దేహాలను సమాదరించి తన అక్షరాల నీడలో సేద తీర్చాడు. 'తరతరాల పేదల త్యాగాల పంటను' దిగమింగిన దగాకోరు రాజకీయాలను నిరసించాడు. ఈ విధమైన సృజన గరిమతో నిజమైన ప్రజాకవిగా దాశరథి ప్రఖ్యాతిగాంచాడు.

ప్రజా పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనటం వల్ల మిగతా కవుల కంటే దాశరథి ప్రభావశీలమైన సాహిత్యాన్ని సృష్టించాడు. విభిన్న సామాజిక శ్రేణుల ప్రత్యేక సమస్యలపై కూడా దాశరథి చూపు సారించి తదనుగుణంగా రచనలు చేశాడు. 'కులమతాల సుడిగుండాల' వల్ల సంభవించే సామాజిక ప్రమాదాలను గురించి దాశరథి హెచ్చరించాడు. 'నా కుల మెద్దియో యెరుగ? నా మత మెయ్యదియో యెరుగ?... లేళ్లది, రాళ్లది యే కులంబాకులమే మదీయము' అని సమానత్వ సందేశాన్ని అందించాడు. మిసిసిపీ విశ్వ విద్యాలయంలో తొలి నీగ్రో పట్టభద్రుడు జేమ్స్ మెరిడిత్‌కు 'నీలి రవ్వ' కవితతో దాశరథి నీరాజనాలు పలికాడు. 'నలుపు లోంచి నవ నాగరికత ఉద్భవిస్తున్నది/ నలుపులోంచి వెలుతురు వికసిస్తుందని' అణగారిన వర్గాల్లో విశ్వవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ప్రతిఘటనాత్మక చైతన్యాన్ని అక్షరబద్ధం చేశాడు. 'జ్ఞాన నయనమ్ములవాడు, 'మనస్సులోపలన్ తెల్లని వాడు', హింసను వధించిన వాడు, శాంతిపై జల్లినవాడు, తెల్లని విషమ్మునకు విరుగైనవాడు' నీలిరవ్వ అని నల్ల జాతీయుల బహుముఖీన ఘనతను పోతన పద్యశైలిలో దాశరథి తేటతెల్లం చేశాడు. వర్ణాంతర వివాహాలు ఎంత ఎక్కువగా జరిగితే అంత కులతత్వం నశిస్తుందని, మతాంతర వివాహాలు కూడా విస్తృతంగా జరగాలని వనితా జ్యోతి పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దాశరథి పేర్కొన్నాడు. స్త్రీలను గౌరవించని జాతి అభివృద్ధి చెందదని ఆయన స్పష్టం చేశాడు. మహాబోధి, మహా పరినిర్వాణం అనే రెండు నాటి కల్లో దాశరథి బుద్ధుని సమతాధర్మాన్ని, కారుణ్య తత్త్వాన్ని ప్రబోధించాడు. 'మానవకోటి బుద్ధమూర్తిని మరిచి పోదగునే' అని కీలకంగా ప్రశ్నించాడు.

అనవద్యమైన కళాతత్త్వంతో దాశరథి తెలుగు పద్యాన్ని కదం తొక్కించాడు. ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతీకగా వచన పండితుల నీలాప నిందలను ఎదుర్కొన్న పద్యాన్ని, తన పెన్ను బలంతో దాశరథి ప్రజాస్వామ్య భావజాల ప్రచారానికి వాహికగా మార్చాడు. 'గుండె దడలో గణాలను గుణించుకొని రాయాలని, సృజనకారులకు హితవు చెప్పిన ఆయన ప్రతి పద్యాన్ని ఇలాంటి శైలితో తీర్చిదిద్దాడు. వచన కవిత్వంలో శ్రీశ్రీ పలికించిన ఒడుపును మాత్రాఛందో ఫణితిని దాశరథి పద్య కవిత్వంలో ప్రతిభావంతంగా పలికించాడు. వచన కవిత్వంలో ఎక్కువగా కనబడే సౌందర్యశోభితమైన వ్యక్తీకరణలతో తెలుగు పద్యానికి కొత్త సొబగులద్దాడు. 'గెలిచినది గడ్డిపోచ, ముక్కలయి పోయి/ మన్ను కరిచెను గొడ్డలి, కన్నులోని/ వేడి అశ్రువు గెలిచెను వాడి కత్తి ఓడిపోయెను' అంటూ ప్రతీకాత్మకంగా అత్యాధునిక అభివ్యక్తితో ప్రజాపోరాట విజయాన్ని దాశరథి అద్భుతంగా కవిత్వీకరించాడు. రెండు వందల ఏండ్ల చరిత్ర పుటలు కప్పుకొని యున్న గాఢాంధకారం, తూరుపు మిట్ట నుంచి, పారి వచ్చిన వెలుతురు వాగులో కొట్టుకొని పోయిందని స్వేచ్ఛా భారతాన్ని కమనీయంగా కీర్తించాడు. ఉర్దూ భాషా పరిమళాలతో దాశరథితన కర్తృత్వానికి పుటం పెట్టుకున్నాడు. 'తమోవృక్షం', 'అశ్రు దీపికలు', 'రుధిర పక్షులు', 'విప్లవ మేఘం', 'వెలుతురుబాకు' లాంటి రూపకాలు ఆయన పద్యనిర్మాణ శిల్పంలో అపురూపంగా ఒదిగిపోయాయి. 'పజ్జొన్నకూడు' లాంటి నిసర్గ సుందరమైన తెలంగాణ పలుకుబడిని తన పద్య పల్లకిలో దాశరథి ఊరేగించాడు.

సమకాలీన కవుల విశిష్టతను, వారి ప్రత్యేక స్థానాన్ని దాశరథి నిజాయితీగా అంచనావేశాడు. 'జాషువా గారితో ఇరువైయవ శతాబ్దంలోని తెలుగు సాహిత్యం ఒక కొత్త మలుపు తిరిగింది' (మహాకవి జాషువా వ్యక్తిత్వం కవిత్వం –డాక్టర్ ఆర్.ఆర్.సుందర రావు పరిశోధన గ్రంథం ముందుమాట) అని సాటికవి ఔన్నత్యాన్ని సత్యసమ్మతంగా అభివర్ణించే ఉదాత్త సంస్కారం దాశరథికి తప్ప మరెవరికుంటుంది. మఖ్దూమ్ మొహియుద్దీన్, కాళోజీ, వట్టికోట, సి.నారాయణరెడ్డి తదితర కవుల గొప్పతనాన్ని కూడా దాశరథి సమున్నతంగా విశ్లేషించాడు.

'తెలగాణ భవదీయ పుత్రకులలో తీండ్రించు వైప్లవ్య సంచలనమ్మూరక పోవలేదని' స్వరాష్ట్ర స్వప్నం సాకరమవుతుందని నాడే దాశరథి ఊహించాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఫలాలను ఆస్వాదిస్తున్న శుభ తరుణంలో ఈ తెలంగాణ సోయికి మూలమైన దాశరథి కవిత్వం అజరామరం.

డాక్టర్ కోయి కోటేశ్వర రావు
94404 80274
(వ్యాసకర్త: తెలుగు శాఖ అధ్యక్షులు, ప్రభుత్వ సిటీ కళాశాల)

పోరుకవికి వందనాలు

వందనాలు వందనాలు
మహారథికి వందనాలు
దాశరథికి వందనాలు
జోహారు జోహారు
విప్లవ కవి విరించికి జోహారు
విశాల హృది ధీశాలికి జోహారు
ఉగ్గపాల పంతం
నిగ్గదీయు నైజం
ఆ నిరంకుశ నైజాము
మెడలు వంచు ధైర్యం
పీడితులకు తాడితులకు
అండ నిలుచు సైన్యం
భూస్వాముల కక్షలు
తెగటార్చు ఖడ్గం
కవనంతో కవాతు
కల్లోలం జవాబు
గుండుకెదురు
గుండె నిలుపు తేజం
ప్రాణమంటే త్రుణము
తన శ్వాసే రణము
మరణమంటే లేదు భయం
అండ నిలుచు అభయం
ఉగ్గ పాల పంతం
నిగ్గదీయు నైజం
నిరంకుశ నైజాం
మెడలు వంచు ధైర్యం
పందొమ్మిదేళ్ళ యువకుడు
సాహిత్య వార్షికోత్సవ
ఓరుగల్లు సభలో
గాండ్రించిన వైనం
ఉరితీసి పిరికితనం
నూరిపోసే ధైర్యం
రజాకార్లకే రంధియై
ఉద్యమానికి ఊపిరియై
గొంతెత్తిన వీరుడు
చురకత్తులే మాటలు
సంకెళ్లకు వెరువక
జైళ్లంటే బెదరక
ఉగ్గ పాల పంతం
నిగ్గదీయు నైజం
ఆ నిరంకుశ నైజాము
మెడలు వంచు ధైర్యం
అగ్నిధార నిప్పు కణిక
నిద్ర లేపె జగమంత
నియంత అంతమిక
రుద్రవీణ తంత్రులు
మీటె హృదయ తంత్రులు
పాడే విప్లవ గీతికలు
తిమిరంతో సమరం
నవోదయ గగనం
ఉషోదయ కిరణం
ఎక్కు పెట్టి రణశరం
వీణ పాటల కాణాచి
వీనులకెంతో అభిరుచి
సాహిత్యపు శిఖరం
లోతైన భావ గర్భితం
పూరించే సమర శంఖం
ఉద్యమ ఉగ్ర సింహం
సల సల మరిగే రక్తం
ఉగ్గ పాల పంతం
నిగ్గదీయు నైజం
ఆ నిరంకుశ నైజాము
మెడలు వంచు ధైర్యం
ఇదే ఇదే నివాళి
శత జయంతి సంబరానికి
దిగ్విజయ అంబరానికి
తెలంగాణ విప్లవరథికి
మానవీయ మహారథికి
మన దాశరథికి

మర్రిబాల్ రెడ్డి

విప్లవధార అగ్నిధార జేజేలు

అందరు మెట్లెక్కి సుఖపడాలనుకుంటారు
పూలపరిమళ విలాసాలనే అనుభవిస్తుంటారు కానీ
పీడితుల కలంగా అవకాశాలను విసిరేసి
ప్రజాకంటక పీడకులని ఎదిరించిన సాహసి
నవాబుల నిలువెత్తు రాచరికాల దాస్యాలు
రజ్వీ రాబందులు దేశ్‌ముఖ్ దొరల అక్కత్యాలు
దిక్కులదిరేలా పర్జన్యమై గర్జించాడు
నా తెలంగాణ కోటి రత్నాల వీణై విప్లవించాడు

తెలంగాణ కోసం శవమైనా సరేనని
ఓరే పిశాచమా! నీ రాచరికం సమాధేనని సవాలిసిరాడు సిమెంట్ కలిపిన బువ్వతో
బందీఖానాలో హింసలు
హత్యల పన్నాగాలెన్నైనా
కవన పయోనిధికి మరణం లేదు
చీకటి కారాగారంలో
కదులనియ్యని ఉక్కు సంకెళ్లు
బొగ్గే సుద్దముక్కై, జైలుగోడల
నిండా నల్లనల్లని అక్షరాలు
జై తెలంగాణ అంటూ
భాస్వరమై మండిన ధిక్కారాస్త్రాలు
నిజాం నిరంకుశ గుండెల్లో పెనుమంటలు

తెలుగుకు తావే లేదన్న కత్తుల బోనులో
తెలంగాణ రచయితల సంఘం తొలి కెరటమై
ఊరు వాడలు ఉత్తేజ కవిత్వమై
తెలుగు వెలుగును దేశానికి ఎలుగెత్తి
బహుభాషా సాంస్కృతిక సేవలై ప్రవహించాడు
శతకాలు రుబాయీలు పద్యాలు నాటికలు
వ్యాసాలు పీఠికలు గేయాలు
నేలంతా మేలుకొలుపు
గజల్ ప్రక్రియలో తొలి పాదమై
అనుసృజనలో వెల్లివిరిసిన తేట తెలుగుదనం

వనపట్ల సుబ్బయ్య
94927 65358

'అగ్నిధార'లు కురిపించిన

అక్షర పయోనిధి

నా అచ్చయిన పుస్తకాలలో మొట్టమొదటిది 'అగ్నిధార' సాహితీ మేఖల పక్షాన 1949లో అచ్చయింది. సాహితీ మేఖల చాలామంది కవులను సృష్టించింది. సాహితీ మేఖల సభ్యులు నల్లగొండ ప్రాంతంలో కలిగించిన సంచలనం మరువరానిది. సభలు, సమావేశాలు, ఉత్సవాలు, ఊరేగింపులు, సన్మానాలు, సత్కారాలు.. ఇల్లూ వాకిలీ మరచి నెలల తరబడి కవులు ఆ ప్రాంతాల్లోనే గోష్ఠులు జరుపుతూ కాలక్షేపం చేసేవారు. అన్నిరకాల కవులూ ఒకరినొకరు ఆదరించుకోవడం, ఒకరి రచనను విని ఒకరు ఆనందించడం వుండేది. ఒకళ్లు అగ్ని కురిపిస్తే, ఒకరు వెన్నెల విరియించేవారు. ఒకరిది గంగా ప్రవాహం అయితే, ఒకరిది సెలయేరు. ఒకరు ఝంఝామారుతం అయితే ఒకరు మలయానిలం.. ఒకరు ఇంద్రకార్ముకాన్ని గూర్చి వ్రాస్తే ఒకరు కార్మికుణ్ని గురించి వ్రాసేవారు. దేవులపల్లి రామానుజరావు చక్కని కవి. అందుకు ఆయన పచ్చతోరణమే సాక్షి. సిరిప్రెగడ భార్గవరావు కమ్మని పద్యాలు వ్రాసి శ్రావ్యంగా చదివేవాడున్నూ. ధవళా శ్రీనివాసరావు చాలా రాశాడు. పులిజాల హనుమంతరావు ఎక్కువగాకున్నా కొంత రాశాడు. గడియారం రామకృష్ణ కంఠం ఎత్తి కావ్యం ఆలపిస్తే వేలాది సభాసదులు మంత్రముగ్ధులై వినేవారు.

– దాశరథి

దాశరథి తన 'అగ్నిధార' కావ్యాన్ని వట్టికోట ఆళ్వార్‌స్వామికి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా దాశరథి వట్టికోట గురించి ఇలా అంటారు.

మిత్రుని కోసం కంఠం
ఇవ్వగలవాడు
మంచికి పర్యాయపదం ఆళ్వార్
అతనిదే సార్థకమైన జీవితం
అతనికి అగ్నిధార అంకితం

నల్లగొండ జిల్లా చండూరు ప్రాంతంలో 1934లో అంబటిపూడి వెంకటరత్నం శాస్త్రి స్థాపించిన 'సాహితీ మేఖల' ఎందరినో ప్రభావితం చేసింది. ఈ సంస్థకు పట్టుగొమ్మల్లాంటి వారిలో దవళా శ్రీనివాసరావు, పులిజాల హనుమంతరావు, సిరిప్రెగడ భార్గవరావు, మద్దోజు సత్యనారాయణ, పులిజాల గోపాలరావులతో పాటు దాశరథి కూడా ఉన్నారు. దాశరథి 'అగ్నిధార' అయితే దవళశ్రీ 'అమృతధార' అని చెప్పుకొంటారు. సాహితీ మేఖలతో సాన్నిహిత్యం పెంచుకున్న దాశరథి నాడు వెలువడిన మాతృభూమి, ప్రజామిత్ర, గోలకొండ, సారథి, అభ్యుదయ, విశాలాంధ్ర వంటి పత్రికలలో ప్రచురింపబడిన కవితలన్నీ సంపుటీకరించి 'అగ్నిధార' పేరుతో సాహితీ మేఖల అచ్చేసింది. ఈ పవిత్ర కార్యానికి ప్రధాన కారకులు దేవులపల్లి రామానుజరావు.

దాశరథి, వట్టికోట 1948లో మూడు నెలలు నిజామాబాద్ సెంట్రల్ జైలులో ఉన్నారు. ఆయనతో మైత్రికి చిహ్నంగా ఈ అగ్నిధారను అంకితం చేసుకున్నానని వట్టికోట అన్నారు. అందుకే దాశరథిని 'కవితా పయోనిధి' అని వట్టికోట సంబోధించేవారు.

'ముసలి నక్కకు రాచరికంబు దక్కునే' అని నిజాంను నిలువెల్లా వణికించిన ఉద్యమకవి దాశరథి. 'తెలంగాణము రైతుదే' అని ఘంటాపథంగా ఎలుగెత్తి చాటిన ధీశాలి ఆయన. రుద్రవీణను మీటి, అగ్నిధారలు కురిపించి అభ్యుదయ కవితామార్గంలో పయనించిన దాశరథి ఎప్పటికీ చిరస్మరణీయుడే.

పున్న అంజయ్య
9396610639

అనితర సాధ్యం

తెలంగాణ గడ్డపై చిన్నగూడూరులో
చిగురించిన కవి సింహమా!
నిను బోలిన రాజులేడని
నూనూగు మీసాలపుడే
నిజాం పిశాచాన్నే నిలదీసిన
నిలువుటద్దం నీవు

అగ్నిధారను సృష్టించి
రుద్రవీణ మ్రోగించి
ఆశలన్ని చెలరేగించి
పునర్నవం పుట్టించి

నిజామాబాద్ చెరసాలలో
'నా తెలంగాణ కోటి రత్నాల వీణ'
అని అమృతాభిషేకం చేసిన
ఆస్థాన కవి!

రారా కృష్ణయ్య రారా కృష్ణయ్య
తెలంగాణ తేరా కృష్ణయ్య అన్న నీ
సంకల్ప బలం, అమోఘం, అసమానం, అనితర సాధ్యం...

యెనుగందుల శంకర్
9440747614

కవితా ఖడ్గం

స్వేచ్ఛ ఆకాశపు
నిండా కమ్ముకున్న
నియంతృత్వపు మేఘాలతో
ముసలి (అ)రాచరికం
బుసలు కొడుతున్న వేళ...

అతడు
ధిక్కార స్వరంతో
పిడికెడు ధైర్యపు అక్షరాలను
ఈ నేల గుండెల్లో విత్తి,
'అగ్ని ధార'లై కురిసి
తిరుగుబాటు వసంతాలను రచించిండు

జైదీ చేసి
కారాగారాలలో ఉంచిన
బొగ్గుతో గోడల మీద
కవితా ఖడ్గాలను దూసి
నేల తెగువను ఎరుక చేసిండు

కలంతో
చీకటి కనుగుడ్లను పొడిచి
వెలుగు గుమ్మాల ముందు
'రుద్రవీణ'ల తంత్రుల నాదమయ్యిండు

ఆ చల్లని సముద్ర గర్భం
దాచిన బడబానల
గోసను, బాసను,
శ్వాసను వినిపించిండు
కావ్య పరిమళాలను విశ్వాన వెదజల్లిండు
కీర్తి శిఖరాలను అధిరోహించిండు.

అభ్యుదయ పథంలో
అలుగెల్లి పారి,
స్ఫూర్తి పతాకమై నిలిచిండు

'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అంటూ
జాతి జనుల గుండె చప్పుడై
నిత్యం మార్మోగుతుండు.

చిక్కొండ్ర రవి
95023 78992

ఆ చల్లని సముద్ర గర్భం

కలం యోధుడా.. కావ్య ధీరుడా..
మహానది పయోనిధీ దాశరథీ.. శరథీ.. రథీ...!

నీ కల నవలోకనం నీ కళ అవలోకనం
నీ వాక్యమొక శరం నీ వ్యాఖ్యానమొక వరం

ఓ ఆకాశవాణి ప్రయోక్త ఓ ఆకాంక్షల వాణి ప్రవక్త
నీ చేతిలో బొగ్గు ముక్క నినాదమై మండే అగ్గి చుక్క

నీ జననం తెలంగాణ నీ పయనం రుద్రవీణ
నీ కవనం అగ్నిధార నీ మరణం అశ్రుధార

ప్రగతిబాట నీ అడుగు జగతితోట నీ గొడుగు
తెలుగుదనపు గిడుగు అక్షరజ్వాలా పిడుగు

ఓ గజల్ కావ్య రుబాయి గాలిబ్ గీతాల భాయి
మహాంధ్రోదయ తురాయి మహోద్యమ సిపాయి

నీ తిమిరంలో సమరం తేనెలూరు తెలుగుదనం
నీ అభిమాన పునర్నవం ఆశయాల వెలుగు వనం!

ధ్వజమెత్తిన ప్రజాగొంతు శివమెత్తిన శ్రీమంతు
అణచబడ్డ నిజాం అహం గర్జించిన కవి సింహం

కవన వనాల కవితా పుష్పకం యాత్రాస్మృతుల మస్తకం
మిన్నేటి పొంగుల దీప్తి ప్రణవ నాథుని అక్షర స్ఫూర్తి

నీ బాలల గేయాల భవిత లీతి సున్నిత భావ హృదయ గీతి
నీ ఆలోచనా లోచనాల ఆర్తి స్తుతి అకుంఠిత సంకల్ప స్మృతి

డాక్టర్ కటుకోర్ఝుల రమేష్
99490 83327

దాశరథి

నీ కలంతో
అగ్నిధార వలె
అక్షరాలను ధారపోసి
రుద్రవీణతో
స్వరాలను సృష్టించి
మహాంధ్రోదయంతో
ఉషోదయాన్ని
నీ ఆలోచన లోచనలతో
అమృతాభిషేకం చేసినవ్

కారు చీకట్లతో కమ్ముకున్న
తెలంగాణ ప్రజలను
తిమిరంతో సమరం చేయించినవ్

పనర్నవంతో
పునర్నిర్మాణం చేసిన
మహాకవి దాశరథి

స్రవంతి మహిపాల్
94923 05647